

రైతుల ఇబ్బందులపై కలెక్టర్ రాజర్షి షాతో చర్చిస్తున్న మాజీ మంత్రి, అఖిల పక్షం రైతు సంఘం నాయకులు

# రైతులకు న్యాయం చేయాలి..

- **మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న**
- **కలెక్టర్‌ను కలిసిన అఖిల పక్ష రైతు సంఘం నాయకులు**

ఎదులాపురం, నవంబర్ 14 : పత్తి కొనుగోళ్ల విషయంలో రైతులకు న్యాయం చేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, అధికార యంత్రాంగం, స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ విషయమై దృష్టి సారించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. గురువారం కలెక్టర్ రాజర్షి షాను అఖిల పక్షం రైతు సంఘం నాయకులతో రైతులు పడుతున్న ఇబ్బందులు, తదితర అంశాలపై కలిసి చర్చించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన విధానాలను వివరిస్తూనే.. ప్రైవేటు వ్యాపారస్తులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న వైనాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇతర రాష్ట్రాల్లో కొనుగోళ్లు జరుగుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఆయా రాష్ట్రాల్లో స్టడీ టూర్ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**బీఆర్ఎస్ హయాంలోనే పత్తికి మంచి ధర కల్పించాం..**

గతంలో పత్తి, సోయా కొనుగోళ్ల సమయంలో ప్రైవేటు వ్యాపారస్తులు, సీసీఐని ఒప్పించి మంచి ధర అందేలా కృషి చేశామని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు.. తేమ శాతం పద్దెనిమిది వరకు ఉన్నప్పటికీ పన్నెండు లోపు పరిగణలోకి తీసుకుని కొనుగోళ్లు జరిగేలా చూశామని పేర్కొన్నారు. ప్రస్తుతం రైతులకు పెట్టుబడి ఖర్చు వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ స్వలాభం కోసం తాము పని చేయడం లేదన్న ఆయన... రైతుకు న్యాయం జరిగేలా ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని సూచించారు. ఈ సమావేశంలో బండి దత్తాత్రి, కొండ రమేశ్, గోవర్ధన్ యాదవ్, లోకారి పోశెట్టి, దేవిదాస్, లక్ష్మణ్, రోకండ్ల రమేశ్, లింగారెడ్డి, నారాయణ. కుమ్ర రాజు, బట్టు సతీశ్, విఠల్ పాల్గొన్నారు.



స్టూడెంట్ యాక్టివిటీ భవనంలో మాట్లాడుతున్న కలెక్టర్

# మన ఆలోచనే మార్పునకు నాంది

**ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సమావేశంలో కలెక్టర్**

బాసర, నవంబర్ 14 : మన ఆలోచన విధానమే మన మార్పునకు నాంది పలుకుతుందని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం బాసర ట్రిపుల్ ఐటీని సందర్శించారు. విద్యార్థిని స్వాతిప్రియ ఆత్మహత్య చాలా బాధాకరమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం 17 కమిటీల విద్యార్థులతో ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ గోవర్ధన్‌తో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన బోధనతోపాటు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థులందరు సానుకూలంగా ఉండాలని, సమస్యలు ఏమైన ఉంటే అధికారులకు తెలియజేయాలని సూచించారు. గతంలో ఇక్కడ చదివిన విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత స్థానంలో ఉన్నారని తెలిపారు. అనంతరం స్టూడెంట్ యాక్టివిటీ భవనంలో పీయూసీ విద్యార్థులతో కలిసి దిశానిర్దేశం చేశారు. జీవితంలో హెచ్చు తగ్గులు ఉంటాయని, ధైర్యంగా అధిగమించి నూతన ఆలోచనలతో ముందుకు సాగాలని సూచించారు. వివిధ పాఠశాలల విద్యార్థుల ప్రొఫైల్ యాప్‌ను రూపొందించాలని కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు సూచించారు. మన చుట్టూ ఉన్న పరిస్థితులను గమనిస్తూ ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకుంటూ ముందుకెళ్లాలని కోరారు. అనంతరం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ గోవర్ధన్ మాట్లాడుతూ.. విద్యార్థులు, ఫ్యాకల్టీ, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, అధికారులు, ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి దిశగా యూనివర్సిటీని ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కోమల్‌రెడ్డి, ఏవో రణదీర్‌సాగి, అసోసియేట్ డీన్స్ స్టూడెంట్ వెల్ఫేర్ నాగరాజు, చీఫ్ సెక్రటరీ ఆఫీసర్ రాజేశ్, తహసీల్దార్ పవన్ చంద్ర పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పీయూసీ విద్యార్థులు



# కాంగ్రెస్‌లో కాక

## మంత్రి పదవిపై ఉమ్మడి జిల్లా హస్తం పార్టీలో పోటాపోటీ

- తమ కుటుంబానికే మినిస్టర్ ఇస్తామని సీఎం హామీ ఇచ్చారన్న ఎమ్మెల్యే వివేక్
- పీఎస్సార్‌కు 'విద్యాశాఖ' అంటూ ఆయన వర్గం ధీమా
- ఖానాపూర్ శాసనసభ్యుడు వెడ్మబొజ్జుకే వస్తుందంటూ ఆదివాసుల ఆశలు

మంచిర్యాల, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్‌లో మంత్రి పదవి 'కాక' రేపుతున్నది. మొన్నటికి మొన్న కాంగ్రెస్ అధిష్ఠానం అనూహ్యంగా వెడ్మ బొజ్జు పేరును పరిశీలిస్తున్న విషయం బయటికి వచ్చింది. దీంతో తూర్పు జిల్లాగా పేరొందిన మంచిర్యాల ప్రాంతానికి చెందిన నాయకులకు కాకుండా, ఈసారి కూడా పశ్చిమ జిల్లా వాసులకే మంత్రి పదవి ఇస్తారనే చర్చ సాగింది. ఈ సర్కారు హయాంలో మా లీడర్‌కు మంత్రి పదవి వస్తుందంటూ ఆదివాసీలు గంపెడాశలు పెట్టుకున్నారు. మంచిర్యాల జిల్లా ఎమ్మెల్యేల్లో ఒకరికి ఆర్టీసీ చైర్మన్, మరొకరికి ప్రభుత్వ విప్ పదవులు ఇస్తారంటూ కాంగ్రెస్ లీడర్లే చెప్పుకున్నారు. ఇదిలా ఉంటే చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మంత్రి పదవిపై బుధవారం కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర మాల సంఘం అధ్యక్షుడు చేపట్టిన పాదయాత్ర మంచిర్యాల జిల్లా ఇందారం చేరుకున్న సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ "ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కాక కుటుంబంలో ఒకరికి మంత్రి పదవి ఇస్తానని హామీ ఇచ్చారు" అంటూ చెప్పుకొచ్చారు. దీంతో మంత్రి పదవి విషయంలో ఆయన ఇంకా పట్టు విడవలేదని స్పష్టమైంది. మా సార్‌కే మంత్రి పదవి అంటూ చెన్నూర్ కాంగ్రెస్ లీడర్లు తెగ ప్రచారం చేస్తున్నారు. దీంతో మంత్రిపదవి అంశం ఉమ్మడి జిల్లాలో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది.

**రెండు నియోజకవర్గాల కాంగ్రెస్‌లో వర్గపోరు**

మరోవైపు మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్సార్ సన్నిహితులు సైతం మా సార్‌కు మంత్రి పదవి ఇస్తారని చెప్పుకొస్తున్నారు. డిసెంబర్‌లో మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని.. మా సార్ మంత్రి అవుతారని, అది కూడా విద్యాశాఖ మంత్రి అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితిల్లో మంచిర్యాల, చెన్నూర్ నియోజకవర్గాల్లోని కాంగ్రెస్ లీడర్లు రెండు వర్గాలుగా చీలిపోయినట్లు తెలుస్తున్నది. ఒకటి పీఎస్సార్ వర్గం, మరొకటి కాక కుటుంబ వర్గంగా ఏర్పడ్డాయనే చర్చ జోరందుకున్నది. చెన్నూర్‌లో ఎమ్మెల్యే వివేక్ అంటే గిట్టని నాయకులు పీఎస్సార్ గూటికి చేరుతున్నారు. మొన్నటికి మొన్న ఓ కేసు విషయపై చెన్నూర్ కాంగ్రెస్ లీడర్లు కొందరు పీఎస్సార్‌తో టచ్‌లోకి వెళ్లారనే గుసగుసలు వినిపించాయి. అంతకు ముందే మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్సార్ విషయాన్ని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది. చెన్నూర్‌లో ఉప ముఖ్యమంత్రి టూర్ రద్దు అయిన రోజు సాయంత్రమే వివేక్ చెన్నూర్‌లో అత్యంత సన్నిహితమైన నాయకులతో సమావేశమయ్యారు. జిల్లాలో మనం పట్టు సాధించాలంటూ చెప్పుకొచ్చారు. దీంతో ఈ ఇద్దరు నాయకులు మధ్య దూరం మరింత పెరిగిందనే వాదనలకు బలం చేకూరింది. మంచిర్యాలలో ఉండి కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశించిన కొందరు కీలక నాయకులు పీఎస్సార్ దగ్గరకు వెళ్లలేక వివేక్‌కు మద్దతుగా నిలుస్తున్నారు. వారంతాల్లో వివేక్ మంచిర్యాలకు వచ్చిన ప్రతిసారి ఆ నాయకులు ఆయన్ని కలవడానికి ఇంటికి వస్తున్నారు. ఇద్దరు నేతల మధ్య అంతర్గతంగా పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనేంత వైరం పెరిగిందని ఆ పార్టీ నాయకులే చెబుతున్నారు. ఎవరికి మంత్రి పదవి వచ్చినా మనకు మంచి జరగాలంటే ప్రస్తుతానికి అంటీ ముట్టనట్లు ఉండడమే మంచిదనే ఆలోచనలో ఉన్నారు.

**చీమ చిటుక్కుమన్నా ఇంటలీజెన్స్ ఆరా..!**

మంచిర్యాల జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నారు. ముగ్గురికి ముగ్గురు మంత్రి పదవి రేసులో ఉన్నారు. ఎవరికి వారు ప్రయత్నాలు తీవ్రతరం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లాలో చీమ చిటుక్కుమన్నా ఇంటలీజెన్స్ ఆరా తీస్తున్నట్లు తెలుస్తున్నది. ఎమ్మెల్యేలు చేసే ప్రతి పనిపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు వెళ్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీన్నే సీఎంతో సాన్నిహిత్యంగా ఉండే ఓ ఎమ్మెల్యే బ్రహ్మాస్త్రంగా వాడుకుంటున్నట్లు తెలిసింది. మంచిర్యాలలో ఇటీవల జరిగిన కూల్చివేతలకు ముందస్తు అనుమతులు తీసుకోకపోవడంపైనా, శాంతి భద్రతలకు కలుగుతున్న విఘాతంపైనా సదరు ఎమ్మెల్యే అధిష్ఠానికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అదే సమయంలో చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో పార్టీలో జరుగుతున్న గొడవలు, చిన్నచిన్న విషయాల్లో అనధికార జోక్యంపై అధికారులు ఆరా తీసినట్లు తెలిసింది. గడిచిన ఏడాది కాలంలో ఎమ్మెల్యేలు చేసిన పనుల్లోని లోపాలను ఎత్తి చూపి మంత్రి పదవికి దాన్ని లింక్ చేస్తారనే చర్చ జిల్లాలో నడుస్తున్నది. వాటి ఆధారంగా మంచిర్యాల జిల్లాలోని ఎమ్మెల్యేలకు నచ్చజెప్పి ప్రభుత్వం ఆదీవాసీ నినాదం ఎత్తుకునే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అదే జరిగితే మంచిర్యాల ఎమ్మెల్యేలు మంత్రి పదవిపై పెట్టుకున్న ఆశలు గల్లంతు అవ్వడం ఖాయంగా కనిపిస్తున్నది.



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో కోమల్ రెడ్డి





నిర్మల్ – భైంసా జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేస్తున్న రైతులు, నిలిచిన వాహనాలు

# రైతన్న రగడ

## ధాన్యం కొనుగోలు చేయాలంటూ రాస్తారోకో

- రోడ్డుకు ఇరువైపులా కిలోమీటరు మేర నిలిచిన వాహనాలు
- ఆర్డీవో హామీతో రైతుల ఆందోళన విరమణ
- వడ్లు కల్లాల్లోనే ఉండడంపై మండిపాటు
- సమగ్ర కుటుంబ సర్వేను బహిష్కరించి నిరసన
- రైతుభరోసా, రుణమాఫీ ఇవ్వకపోవడంపై భగ్గు

కుంటాల, నవంబర్ 14 : నిర్మల్ జిల్లా కుంటాల మండల పరిధిలోని అర్లీ క్రాస్ రోడ్డు వద్ద ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ గురువారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. లోకేశ్వరం మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన వందలాది మంది రైతులు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న నిర్మల్–భైంసా రహదారి వద్దకు చేరుకుని ధర్నా చేశారు. దాదాపు రెండు గంటలు రోడ్డుపై కూర్చొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. ఇరువైపులా కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కేంద్రాలు ప్రారంభించి 50 రోజులు గడిచినా.. ధాన్యం తూకం వేయడం లేదని రైతులు మండిపడ్డారు. తూకం వేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు పంపినా తాలు ఉందనే సాకుతో మిల్లర్లు దింపుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా ఇటీవల మా గ్రామంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను బహిష్కరించినా అధికారులు స్పందించడం లేదని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం రైతు భరోసా, రుణమాఫీని పూర్తి చేయట్లేదని విమర్శించారు. కలెక్టర్, ఇతర జిల్లా అధికారులు వచ్చే వరకు దీక్ష విరమించబోమని రైతులు మొండికేశారు. కాసేపటికి భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి ధర్నా ప్రాంతానికి చేరుకుని రైతుల సమస్యలను విన్నారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు చేస్తున్నామని, త్వరలో అబ్దుల్లాపూర్‌లోని కొనుగోలు కేంద్రాన్ని పర్యవేక్షిస్తానని హామీ ఇచ్చారు. దీంతో రైతులు శాంతించి రోడ్డుపై నుంచి కదిలారు. భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్, రూరల్ సీఐ నైలు, ఎస్ఐలు భద్రతా చర్యలు చేపట్టారు.

**దోపిడీని అరికట్టాలి..**

*దాదాపు రెండు నెలల నుంచి ధాన్యం కల్లాల్లోనే ఉంటున్నది. ఎండలకు వడ్లు పగిలిపోతున్నాయి. ఎన్నిసార్లు విన్నవించుకున్న అధికారులు పట్టించుకోవడం లేదు. క్వింటాలుకు అదనంగా కొన్ని కిలోలు కొసరు జోకినా ఇబ్బంది పెడుతున్నారు. అందుకే సమగ్ర సర్వేను బహిష్కరించినం. దోపిడీని అరికట్టి కొనుగోళ్లను ప్రారంభించాలి.*



- రాజారెడ్డి, రైతు, అబ్దుల్లాపూర్

**రైతు భరోసా, రుణమాఫీ ఇవ్వట్లేదు..**



*రైతు భరోసా, రుణమాఫీ ఇవ్వని ప్రభుత్వం, ధాన్యాన్ని కూడా సక్రమంగా కొనుగోలు చేయడం లేదు. యేడాదికి 80 నుంచి 90 లారీ లోడ్ల వరి పండిస్తాం. కానీ.. ప్రభుత్వం నుంచి సహకారం అందట్లేదు. ప్రతి ఏడాది ఆలస్యమే. రైతులు నష్టపోకుండా కాంటా వేయాలి.*

- దడిగే భోజన్న, రైతు, అబ్దుల్లాపూర్





కజ్జర్లలో తవ్విన మొరం గుంతలో నీరు

తలమడుగు మండలంలోని దేవాపూర్‌లో పొలాల పక్కన మొరం తవ్వకాలు

# మృత్యు గుంతలు

## మొరం, క్వారీ గుంతల్లో పడి పలువురి మృత్యువాత

- తాజాగా బంగారుగూడ వద్ద గుంతలో ఆటో పడి మహిళ మృతి
- ఇష్టానుసారంగా తవ్వకాలు.. చోద్యం చూస్తున్న అధికారులు
- అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్న రైతులు, స్థానికులు

ఆదిలాబాద్, నవంబర్ 14(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో అక్రమ మొరం తవ్వకాలు ప్రజల పాలిట శాపంగా మారాయి. అక్రమార్కులు ఇష్టానుసారంగా తవ్వకాలు జరుపుతుండడంతో రోడ్లకు ఇరువైపుల, పొలాలకు వెళ్లే దారుల్లో భారీగా గుంతలు ఏర్పడ్డాయి. వర్షాకాలంలో ఈ గుంతల్లో నీరు నిల్వ ఉండడంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. గతంలో తలమడుగు మండలంలోని దేవాపూర్‌లో మొరం గుంతలో పడి ఇద్దరు మరణించారు. ఈ యేడాది ఆగస్టులో బజార్‌హత్నూర్ మండలంలో కంకర క్వారీ గుంతలో పడి ఇద్దరు మృతి చెందారు. గురువారం పత్తి కూలీలతో వెళ్తున్న ఆటో ఆదిలాబాద్ సమీపంలోని బంగారుగూడ వద్ద మొరం క్వారీలో పడడంతో సవిత మరణించగా.. మరో ముగ్గురు మహిళలకు తీవ్రగాయాలయ్యాయి. జిల్లాలోని తలమడుగు, తాంసి, మావల, ఆదిలాబాద్ రూరల్ మండలాల్లో మొరం తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అనుమతులు లేకుండా అక్రమార్కులు తవ్వకాలను సాగిస్తున్నారు. తవ్వకాలు అసైన్డ్, ప్రభుత్వం, అటవీ భూముల్లో కూడా జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. తలమడుగు మండలంలోని దేవాపూర్, కజ్జర్ల.. తాంసి మండలంలోని గుడ్డిగుట్ట ప్రాంతాల నుంచి పగలు, రాత్రి తేడా లేకుండా తవ్వకాలు సాగిస్తున్నారు. మొరం తవ్వకాలను అడ్డుకోవాల్సిన మైనింగ్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు.

**ప్రమాదకరంగా గుంతలు**

రోడ్ల నిర్మాణం, లే అవుట్‌లు, ఇండ్ల నిర్మాణం, ఇతర అవసరాలకు మొరం అవసరమవుతుండడంతో ఈ అక్రమ దందాకు మూడు జేసీబీలు, ఆరు టిప్పర్ల లా కొనసాగుతున్నది. పొలాల పక్క నుంచి టిప్పర్ల ద్వారా మొరం తరిస్తుండడంతో దుమ్ము, దూళీ కారణంగా పంటలు పాడవుతున్నాయి. భూమిపై భాగం నుంచి 8 నుంచి 10 మీటర్ల లోతు, ఐదారు వందల మీటర్ల వెడల్పుతో తవ్వకాలు చేపడుతుండడంతో భారీ గుంతలు ఏర్పడి నీరు నిలుస్తున్నది. పొలాలకు వెళ్లే దారిలో తవ్వకాల కారణంగా పశువులు, రైతులు, కూలీలు, వాహనాలు, ఎడ్లబండ్లు గుంతల్లో పడిపోయే ప్రమాదం ఉందంటున్నారు. మొరం అక్రమ రవాణాను అడ్డుకోవాలని గతంలో తాము అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని రైతులు అంటున్నారు. అధికారులు స్పందించి మొరం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు.



మృతి చెందిన సవిత(ఫైల్)



ఆదిలాబాద్ సమీపంలోని డంప్‌యార్డు వద్ద మొరం గుంతలో పడిన ఆటోను తీస్తున్న పోలీసులు